సాక్షి
నల్లగొండ

శనివారం : 26 : అక్టోబర్ : 2024



రూ.కోట్లలో కొల్లగొట్టారు..
రూ.వేలల్లో పెట్టుబడి పెడితే రూ.లక్షల్లో సంపాదించవచ్చని ఓ కంపెనీ నిర్వాహకులు రూ.కోట్లలో కొల్లగొట్టారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.30 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,45,136 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 96,324 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,719 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1088 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 700 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్ : మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించిన మిర్యాలగూడ డివిజన్‌స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, పథకాల అమలు, సాధించిన ఫలితాలు, అందిస్తున్న వైద్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పనితీరు మెరుగు పరుచుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఆరోగ్య పథకాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణకుమారి, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, డాక్టర్ అరుంధతి, దుర్గయ్య, కృష్ణ, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రైల్వే లైన్ ట్రయల్ రన్ విజయవంతం



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

మిర్యాలగూడ : విష్ణుపురం నుంచి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వరకు నూతన రైల్వేలైన్ పూర్తికావడంతో శుక్రవారం టీజీ జెన్‌కో, రైల్వే అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఎనిమిది కిలోమీటర్ల మేర రెండు లైన్ల పనులు ఇటీవల పూర్తయ్యాయి. పవర్‌ప్లాంట్‌కు బొగ్గు తరలింపునకు ఈ లైన్ ఏర్పాటు చేశారు. పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల విద్యుత్ సామర్థ్య కలిగిన 5 విద్యుత్ యూనిట్లకుగాను ఇప్పటికే రెండింటిని పూర్తిచేయగా మరో మూడు యూనిట్ల పనులు శరవేగంగా సాగుతున్నట్లు టీజీ జెన్‌కో డైరెక్టర్ అజయ్, సీఈ సమ్మయ్య తెలిపారు.

ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలి

మిర్యాలగూడ : వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం దామరచర్ల మండలంలోని కేజేఆర్ కాలనీ, దిలావర్‌పూర్ గ్రామాల్లో వర్షాలకు నేలవాలిన పంటలను పరిశీలించారు. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి పరిహారం అందించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వినోద్ నాయక్, శశిధర్‌రెడ్డి, కోటిరెడ్డి, దయానంద్, శ్రీనునాయక్, మట్టయ్య, పీక్యా, శేఖర్‌రెడ్డి, వాగ్యా, హన్మ, చిన్న, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బి.వెల్లంల ప్రాజెక్టులోకి నీటి విడుదల

నార్కట్‌పల్లి : రైతులకు సాగునీరు ఇబ్బందులు తొలగించేందుకు గాను ఉదయ సముద్రం నుంచి బి వెల్లంల చెరువులోకి శుక్రవారం సాయంత్రం సంబంధిత అధికారులు నీటిని విడుదల చేశారు. రోజుకు 10 గంటల చొప్పున ఐదు రోజులపాటు నీటిని విడుదల చేసి చెరువును నింపుతామని అధికారులు పేర్కొన్నారు. పంప్‌హౌస్ నుంచి చెరువులోకి వస్తున్న నీటిని తిలకించి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వెల్లంల చెరువులోకి వస్తున్న నీరు



12గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్ : సాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద వస్తుండడంతో శుక్రవారం అధికారులు 12 రేడియల్ క్రస్ట్ గేట్లుఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఉదయం వరకు 22 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగగా.. వరద తగ్గడంతో పది గేట్లను మూసివేశారు. ప్రాజెక్టులోకి 1,45,136 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

దీపావళికి ముందే పేలుతున్నయ్..

రాజకీయ టపాసులు

అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

- 'అంబుజా'పై ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా మొదలైన దుమారం
- తోడైన మూసీ పునరుజ్జీవ అంశం
- ఏకతాటిపై వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు
- మూకుమ్మడిగా మంత్రి కోమటిరెడ్డిపై విమర్శలు
- దీటుగా తిప్పికొడుతున్న కాంగ్రెస్ శ్రేణులు



దీపావళికి ముందే జిల్లాలో పొలిటికల్ టపాసులు పేలుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో రామన్నపేటలో నిర్మించతలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజాభిప్రాయ సేకరణ వ్యవహారం అధికార ప్రతిపక్షాల మధ్య పెద్ద దుమారమే లేపింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇదే కాకుండా మూసీ శుద్ధీకరణ విషయంలో మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘాటుగా విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దానిపై కూడా బీఆర్‌ఎస్ శ్రేణులు ఎదురుదాడికి దిగాయి.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రెండు రోజుల కిందట భువనగిరి జిల్లా రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ జరగగా.. దానిని బీఆర్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. అంతటితో ఆగకుండా తీవ్ర స్థాయిలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు తీవ్ర పదజాలంతో విమర్శలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కూడా అదే స్థాయిలో ఘాటుగా విమర్శలకు దిగారు. మూసీ పునరుజ్జీవ అంశం కూడా రాజకీయ దుమారానికి కారణమైంది. మూసీ ప్రక్షాళనను కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అడ్డుకుంటున్నారని, మూసీ శుద్ధీకరణ పూర్తయితే నల్లగొండ జిల్లాకు మేలు జరుగుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ శుద్ధీకరణకు ప్రణాళిక వేసినా పట్టించుకోవడం లేదని, ఆ పనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూనుకుంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ టార్గెట్‌గా రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి, దోచుకున్నది చాలక, జిల్లా ప్రజలను చంపాలని చూస్తున్నారని విమర్శలు గుప్పించారు. మంత్రి విమర్శలకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఒక్కరే ఇన్నాళ్లుగా కౌంటర్ ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

ఏకతాటిపై బీఆర్‌ఎస్ నాయకులు

రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేసిన నేపథ్యంలో దానిని అడ్డుకునేందుకు, జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలంతా రోడ్డెక్కారు. వారిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్ తదితరులు నల్లగొండలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఘాటుగా విమర్శలు చేశారు. మంత్రిపై గాదరి కిషోర్, భూపాల్‌రెడ్డిలు వ్యక్తిగతంగా దూషణలకు దిగారు. దీంతో జిల్లాలో రాజకీయ వేడి రగులుకున్నట్లైంది. పది నెలలుగా ఏ అంశంపైనా.. ఎక్కడా పెద్దగా స్పందించని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఒక్కసారిగా కోమటిరెడ్డిపై మాటల దాడికి దిగడం చర్చనీయాంశమైంది.

అదే స్థాయిలో స్పందించిన కాంగ్రెస్

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ నాయకులు.. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, భూపాల్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ తదితరులు మూకుమ్మడిగా బీఆర్‌ఎస్ నేతలపై విమర్శలు చేశారు. గాదరి కిషోర్ చరిత్ర ఏమిటో అందరికీ తెలుసునని, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మంత్రిని విమర్శిస్తే తమ చేతులకు పని చెప్పాల్సి వస్తుందంటూ ఘాటుగా స్పందించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల పరస్పర విమర్శలతో జిల్లాలో రాజకీయ ఒక్కసారిగా వేడెక్కింది.

ఆయిల్‌పామ్‌తో రైతులకు మేలు



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : ఆయిల్‌పాం తోటలను పెంచడం రైతులకు ఒక మంచి అవకాశమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయాదిత్య భవన్‌లో ఆయిల్‌పాం తోటల పెంపకంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 10వ తేదీలోపు ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో కనీసం 150 ఎకరాల్లో ఆయిల్‌పాం తోటలు పెంచేందుకు రైతులను గుర్తించి డీడీలు చెల్లించేలా చూడాలన్నారు. ఈ తోటలు వేసిన రైతులు నష్టపోరని.. సాగు కూడా సులభమని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందుగానే రైతులతో ఒప్పందం కుదుర్చుకుని ధర నిర్ణయిస్తుందన్నారు. ధాన్యం, పత్తి అమ్మిన రైతులకు వెంటనే అకౌంట్లలో డబ్బులు జమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, డీఏఓ శ్రవణ్, ట్రైనర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పూర్తిచేయాలి

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నీ పదిరోజుల్లోగా పూర్తిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మండలాల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వనమహోత్సవం కింద నాటిన మొక్కల సంరక్షణ తదితర పనులు నిరంతరం నిర్వహించేలా చూడాలన్నారు. ఎంపీడీఓలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సౌకర్యాలు, కొనుగోళ్లను పరిశీలించాలన్నారు. పత్తి రైతులు తేమ ఎక్కువగా లేకుండా పత్తిని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నవంబర్ మొదటి వారంలో రాష్ట్ర బీసీ కమిషన్ జిల్లాలో సోషియో ఎకనామిక్ సర్వేపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికే 'మీట్ యువర్ ఎస్పీ'

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చింతపల్లి : ప్రజల అందజేసే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకే 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. శుక్రవారం చింతపల్లి పోలీస్‌స్టేషన్ ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషనకు వచ్చిన పలువురు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. ప్రజలకు చేరు అయ్యేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నూతనంగా నిర్వహిస్తున్న పోలీస్‌స్టేషన్ పనులను పరిశీలించి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, ఎస్‌ఐ యాదయ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సాయి సన్నిధిలో ఎస్పీ ప్రత్యేక పూజలు

చింతపల్లి షిరిడి సాయిబాబా దేవాలయాన్ని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి అష్టోత్తర శతనామావళి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర

గుర్రంపోడు : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకొని మద్దతు ధర పొందాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం గుర్రంపోడు మండలంలోని ముల్కలపల్లి, పిట్టలగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం వచ్చిన వెంటనే తేమను చెక్ చేసి త్వరగా కాంటాలు వేసి.. లారీల్లో గోడౌన్‌లకు తరలించాలని నిర్వాహకులకు అన్నారు. అనంతరం తేనపల్లి, పిట్టలగూడెం గ్రామాల్లోని వైకుంఠధామాలను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనాలకు సరైన సమయంలో నీళ్లు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంజుల, ఏఓ మాధవరెడ్డి, ఎంపీఓ సుమలత, డీటీఎస్ సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

పాఠశాల పరిశీలన

గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు శుక్రవారం సందర్శించారు. మన ఊరు–మన బడి కింద చేపట్టిన పనులు నిలిచిపోయిన విషయాన్ని ఉపాధ్యాయులు ఆయను వివరించారు. ఆయన వెంట ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ యాదగిరి ఉన్నారు.

ఆరోగ్యానికి 'అమ్మ కోసం'

- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమం
- యాప్ ద్వారా సేవలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం



నల్లగొండ టౌన్ : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'అమ్మ కోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేషనల్ హెల్త్ మిషన్, యూనిసెఫ్ భాగస్వామ్యంతో అమరన్ అనే స్వచ్ఛంద సంస్థ 'అమ్మ కోసం' అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్య సంబంధ అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చే విధంగా ఈ యాప్‌ను రూపొందించారు.

త్వరలో ఏఎన్‌ఎంలకు శిక్షణ

గ్రామాల్లోని చిన్న పిల్లల్లో ఎక్కువగా పౌష్టికాహార లోపం ఉంటుంది. వారికి అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పౌష్టికాహారం అందిస్తుంది. కానీ గర్భిణులు రక్తహీనత సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారి కోసమే ప్రభుత్వం అమ్మ కోసం కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ముంబైకి చెందిన అమరన్ సంస్థ సహకారంతో గర్భిణులు, బాలింతలు ఎలాంటి జాగ్రత్త తీసుకోవాలి, రక్తహీనత సమస్యను ఎలా అరికట్టాలనే అంశాలపై జిల్లాలోని ఏఎన్‌ఎంలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో త్వరలో అమరన్ సంస్థతో శిక్షణ ఇప్పించనున్నారు. గర్భధారణ సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం, పిండం ఎదుగుదల పర్యవేక్షించడం ఎలా అనే అంశాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. లోపాలు ఉంటే వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాప్‌లో సూచించిన విధంగా ఏఎన్‌ఎంలు.. గర్భిణులకు అవగాహన కల్పించనున్నారు.

గర్భిణులకు ఎంతో మేలు

అమ్మ కోసం యాప్ గర్భిణులకు కల్ప తరువు లాంటిది. హైరిస్క్ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పిస్తాం. యాప్‌ను ఏఎన్‌ఎంలు ట్యాబ్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే 15 రోజులకోసారి ఒక్కో అంశంపై వారికి ఒక లింక్‌ను ఆడియో, వీడియో రూపంలో పంపిస్తారు. వాటి ద్వారా ఏఎన్‌ఎంలు గర్భిణులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు.

– డాక్టర్ అరుంధతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి

ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా విమల

నల్లగొండ టూటౌన్ : నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ మోడల్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డి.విమలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ డీఈఓ భిక్షపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండలోని ఇండోర్ స్టేడియం ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు పీఈటీలు, పీడీలు సత్కరించారు. కార్యక్రమంలో మేకల జాన్‌రెడ్డి, వాసుదేవరావు, హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇమామ్ కరీం, ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ బొమ్మపాల గిరిబాబు, నాతి వెంకట్ పాల్గొన్నారు.

1న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్ : హాలియాలోని సీపీఎం కార్యాలయం పక్కన ఉన్న శ్రీ శ్లోకా స్కూల్‌లో నవంబరు 1వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి (అండర్–19) కె.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే క్రీడాకారులు బోనఫైడ్ సర్టిఫికెట్ తోపాటు పదో తరగతి మెమోతో హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9640140183 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

7.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

శాలిగౌరారం : వానాకాలం సీజన్‌లో 7.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీష్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, నూతన గోదామును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 337 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ధాన్యం దిగుమతికి మిల్లుల కేటాయింపు చేయలేదని, ప్రభుత్వ, ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేస్తున్నామన్నారు. శాలిగౌరారంతో పాటూ సమీప మండలాలకు చెందిన ధాన్యంను శనివారం నుండి ఈ గోడౌన్‌లోనే నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఆయనవెంట మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, పీఏసీఎస్ సీఈఓ ఆంజనేయులు, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి శంకర్, మార్కెట్ సిబ్బంది ఉన్నారు.



శాలిగౌరారంలో గోదామును పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీష్

గీత కార్మికులకు రక్షక్ కిట్లు

- తాటిచెట్లు ఎక్కే క్రమంలో జారిపడకుండా కాపాడుతుంది
- కాటమయ్య కిట్ల పేరుతో పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- జిల్లాకు తొలి విడతగా 1,015 కిట్లు మంజూరు

నల్లగొండ: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కార్మికులు కల్లుగీసేందుకు తాటిచెట్లు ఎక్కి, దిగే క్రమంలో మోకు జారి కిందపడి ప్రాణాపాయం జరగకుండా.. అలాగే బీపీ, షుగర్ ఉన్నవాళ్లు కళ్లు తిరిగి చెట్టుపై నుంచి కింద పడకుండా రక్షక కిట్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలోనే కాటమయ్య రక్షక్ కిట్‌కు రూపకల్పన చేసి హైదరాబాద్ ఐఐటీ నిపుణుల చేత పరీక్షించారు. కిట్ల ద్వారా గీత కార్మికులకు రక్షణ కల్పించవచ్చని భావించిన ప్రస్తుత ప్రభుత్వం కాటమయ్య రక్షక్ కిట్ల పేరుతో అందిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు మొదటి విడతలో 1,015 కిట్లు మంజూరు చేయగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తున్నారు. ఈ కిట్‌ను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై శిక్షణ పొందిన ట్రైనర్లు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ ట్రయల్ వేసి కూడా చూపిస్తున్నారు.

ఐదు రకాల పరికరాలతో కిట్..

గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కేందుకు నడుముకు మోకు, ముస్తాదు ఉపయోగిస్తారు. దీనికి బదులు ఐదు రకాల పరికరాలతో కాటమయ్య రక్షక్ కిట్‌కు రూపకల్పన చేశారు. ఈ ఐదు రకాల్లో ఒకటి నడుముకు కట్టుకునే బెల్టు ఇది 500 కేజీల బరువును ఆపుతుంది. మరొకటి రూప్ (తాడు) 22 కేజీల వరకు బరువు మోస్తుంది. మూడోది ప్లాంప్‌లు నడుము బెల్టును తాడుకు అనుసంధానం చేస్తూ మోకు చుట్టూ బిగిస్తారు. కాలు బెల్టు ఇది చెట్టు ఎక్కేటప్పుడు కాలుకు గుత్తిగా వాడతారు. ఆ గుత్తి ఊడిపోకుండా ఈ బెల్టు ఉంటుంది. చివరిది క్రికెట్ ప్లేయర్లకు ఉపయోగించే గార్డును కూడా ఈ కిట్‌లో ఉంచారు. ఈ కిట్‌ను ధరించి తాటిచెట్లు ఎక్కడం ద్వారా వర్షాకాలంలోనూ మోకు జారినా తాడు చెట్టుకు బిగుసుకుపోతుంది. ఒకవేళకాలు జారినా, మోకు జారినా చెట్టుకు వేలాడతాడు. కార్మికుడు తేరుకుంటే అతనే మళ్లీ అదే మోకుతో దిగే అవకాశం ఉంటుంది. ఒక వేళ అతను అలా తేరుకోలేక పోతే ఇతరుల సాయంతోనైనా కిందకు దింపే అవకాశం ఉంటుంది. ఫలితంగా కార్మికులు కిందపడి ప్రాణాపాయం జరగకుండా కాపాడగలుతుంది. రూ.9,280 విలువ జేసే ఒక్కో కిట్ ఎన్ని సంవత్సరాలైన క్లాంప్‌లు కూడా జంగ్ పట్టకుండా ఉంటాయని అధికారులు అంటున్నారు.



కాటమయ్య కిట్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్న కార్మికులు

నియోజకవర్గాల వారీగా మంజూరైన కిట్లు	
నల్లగొండ	300
నకిరేకల్	208
మిర్యాలగూడ	107
మునుగోడు	200
నాగార్జునసాగర్	100
దేవరకొండ	100

రక్షక్ కిట్‌తో ఎంతో ప్రయోజనం

కాటమయ్య రక్షక్ కిట్ గీతకార్మికులకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటోంది. తాటిచెట్ల పైనుంచి జారిపడిన సందర్భంలో కిందపడకుండా ప్రాణాలు కాపాడుతోంది. గత ప్రభుత్వ హయాంలో దీన్ని సిద్ధం చేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ కిట్ ధరించి తాటిచెట్లు ఎక్కితే మోకు జారినా కిందపడకుండా రక్షణగా ఉంటుంది.

– సత్తయ్యగౌడ్, శిక్షకుడు

క్లుప్తంగా

బాలికను బాలసదన్‌కు తరలింపు


బాలికను బాలసదన్‌కు తరలిస్తున్న చైల్డ్‌వెల్ఫేర్ అధికారులు

నాంపల్లి: మండలంలోని గట్లమల్లేపల్లి గ్రామంలో ఓ బాలికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాకు చెందిన ఓ కుటుంబానికి సుమారు రూ.12లక్షలకు విక్రయించిన విషయం విదితమే. దీంతో తండ్రి సైదిరెడ్డి బాలికపై బెంగతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయంపై సాక్షి దినపత్రికలో ×కుమార్తెను విక్రయించారని తండ్రి ఆత్మహత్య× అనే శీర్షిక వార్త ప్రచురించింది. స్పందించిన చైల్డ్‌వెల్ఫేర్, ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం బాలికను స్థానిక పోలీసుల సహకారంతో చేరదీశారు. సంబంధిత అధికారులతో గ్రామంలోని బాలిక ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. చైల్డ్‌వెల్ఫేర్ అధికారులు రాము, స్వాతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి బాలికను బాల సదన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శోభన్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న డీఎస్పీ

కోదాడరూరల్ : పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్యూప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సాయంతో పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కోదాడ పట్టణ పరిధిలో తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న పలువురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈమేరకు ఫిర్యాదులు స్వీకరించి సీఈఐఆర్ సాయంతో 16 సెల్‌ఫోన్లను రికవరీ చేసి శుక్రవారం బాధితులకు అందించినట్లు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాము, సిబ్బంది ఉన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత


కంటైనర్‌ను పట్టుకున్న పోలీసులు

నాగార్జునసాగర్: కంటైనర్ లారీలో పశువులను కబేలాలకు తరలిస్తుండగా.. నాగార్జునసాగర్(విజయపురిటౌన్) పోలీసులు పట్టుకుని ఐదుగురిపై కేసు నమోదు చేశారు. సాగర్ సీఐ బీసన్న, విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్ల గ్రామం నుంచి పది దున్నపోతులు, రెండు గేదెలు, 23 ఎద్దులను కంటైనర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుండగా హిల్‌కాలనీ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాయి. పశువులను చండూరులోని గోశాలకు తరలించారు. ఈమేరకు రంగుండ్లకు చెందిన రమావత్‌స్వామి, కేరళలోని మల్లాపురానికి చెందిన ట్రక్ డ్రైవర్ పుంతుర్తి షబ్బీర్, జమీర్ కాశీం, అనంతపురం జిల్లా కరువులపల్లి తండా గోరంట్లకు చెందిన కిమావత్ రంజిత్ నాయక్, అంగోతు రాఘవేంద్ర నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

చౌటుప్పల్ రూరల్: మండలంలోని జైకేసారం గ్రామంలో బెల్టు షాపులపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఈమేరకు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న పందుల సుగుణమ్మపై కేసు నమోదు చేసి, రూ.8వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

రూ.కోట్లు కొల్లగొట్టారు..
ముఖం చాటేశారు!

- సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను తయారు చేసే కంపెనీ పేరిట కార్యాలయాలు
- వేలల్లో పెట్టుబడులు పెట్టించుకున్న నిర్వాహకులు
- ఆరోపణలు రావడంతో కార్యాలయాల మూసివేత
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5వేల మంది వరకు బాధితులు

కోదాడ: 'దుబాయ్‌లో ప్రధాన కార్యాలయం.. హైదరాబాద్‌లో మూడు ఫ్లోర్లలో కార్యాలయం.. వాట్సాప్, ఫేస్‌బుక్‌కు దీటుగా తయారు చేస్తున్న సాఫ్ట్‌వేర్ టూల్స్ త్వరలో మార్కెట్‌లోకి వస్తాయి.. అవి మార్కెట్‌లోకి వస్తే మిగతావన్నీ పడిపోతాయి. ఇందులో రూ.9వేలు పెట్టుబడి పెడితే తరువాత లక్షల్లో సంపాదించవచ్చు.' ఇలా ఓ కంపెనీ నిర్వాహకులు మాయమాటలు చెప్పారు. ఈ క్రమంలో 2017లో కోదాడలోని టీఎస్‌జీట కార్యాలయంలో మూడు గదులను అద్దెకు తీసుకొని కార్యాలయాన్ని తెరిచారు. గతంలో కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో భారీ సభను కూడా ఏర్పాటు చేశారు. ఏడు సంవత్సరాల పాటు కంపెనీలో పెట్టుబడులు పెట్టించుకుని, అనంతరం మూసివేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ కంపెనీకి సంబంధించిన కార్యాలయాలు మూసివేసినట్లు తెలిసింది.



వేల మంది బాధితులు..

ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ దందాలో పెట్టుబడులు పెట్టిన వారికి నేటి వరకు నయా పైసా ఆదాయం రాలేదు. ఉమ్మడి జిల్లాలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఏజెంట్లుగా మారి వందల మంది నిరుద్యోగులను ఇందులో చేర్పించినట్లు సమాచారం. ఇందులో సుమారు 4వేల మంది నుంచి 5వేల మంది వరకు ఉన్నారు. సాఫ్ట్‌వేర్ టూల్స్‌ను తయారు చేస్తున్నామని చెప్పిన ఈ కంపెనీ ప్రతినిధులు ప్రతి సభ్యుడి నుంచి రూ. 9 వేలు కట్టించుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రూ.50వేల కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. కంపెనీలో ఫౌండర్స్‌గా ఉంటారని చెప్పి ఎక్కువ మందిని చేర్పించిన వారికి ప్రత్యేకమైన ర్యాంక్ ఇస్తామని చెప్పడంతో కొందరు లక్షల రూపాయలను పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. ఇందులో చేరిన వారికి సంవత్సరాల తరబడి రాబడి రాకపోవడంతో కార్యాలయం వద్దకు వచ్చి గొడవలు చేసే అవకాశం ఉందని ఈ కార్యాలయాలు ఎత్తివేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న కార్యాలయం కూడా నామమాత్రంగా నిర్వహిస్తున్నారని, తమ డబ్బులు తిరిగి చెల్లించాలని లేని పక్షంలో త్వరలోనే దీనిపై జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కొందరు బాధితులు తెలిపారు. అయితే ఇప్పటికీ దీనికి సంబంధించిన కార్యాలయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉందని, అందులో 300 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

అభివృద్ధి పథంలో పారిశ్రామిక రంగం


మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

చౌటుప్పల్ రూరల్: రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అభివృద్ధి పథంలో పయనిస్తోందని టీజీఐఐసీ (తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్) చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్విరో ఫ్లూయిడ్స్ పరిశ్రమను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కన్నా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి అధిక పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అనంతరం పారిశ్రామికవేత్తల సమాఖ్య అభివృద్ధి చేసిన ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను సందర్శించారు. ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసిన తీరును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి వివరించారు. నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ.. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. దండుమల్కాపురం పారిశ్రామిక ప్రాంతానికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ కార్యదర్శి గోపాల్‌రావు, టీజీఐఐసీ యాదాద్రి జోనల్ మేనేజర్ సంతోష్, ఇండస్ట్రియల్ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, స్వామిగౌడ్, యాదయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, కళా రమేష్, శ్రీనివాస్, ఎన్విరో ఫ్లూయిడ్స్ ఎండీ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గరిడేపల్లి: మండల పరిధిలోని పొనుగోడు రిజర్వాయర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ చలిగంటి నరేష్ శుక్రవారం తెలిపారు. మృతుడికి 25 నుంచి 30 సంవత్సరాల వయసు ఉంటుందని, కుడి చేతికి కుడి కాలికి రాగి కడియం ఉందని పేర్కొన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లోగాని, 8712686053 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పాఠశాలలో చోరీ


ల్యాబ్‌లో ధ్వంసమైన పరికరాలు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని చీదెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంభులింగం తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాల విధులు ముగించుకొని తాళాలు వేసి వెళ్లగా శుక్రవారం పాఠశాల తెరిచే సమయానికి వచ్చి చూసేసరికి సైన్స్ ల్యాబ్ తలుపులు పగులగొట్టి ఉన్నాయని, సైన్స్ పరికరాలు చోరీకి గురయ్యాయని తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

పోలీసులకు పట్టుబడిన పాత నేరస్తుడు

చౌటుప్పల్ : గతంలో వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన ఓ పాత నేరస్తుడు శుక్రవారం చౌటుప్పల్ పోలీసులు చిక్కాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన కారం నరేష్ గతంలో వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి అతడు పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో అతడు దొంగతనాలకు పాల్పడేందుకు శుక్రవారం చౌటుప్పల్‌కు చేరుకుని బస్‌స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని విచారించగా పాత నేరస్తుడిగా తేలింది. అతడిపై చౌటుప్పల్‌లో ఆరు, నారాయణపురంలో ఒకటి, చివ్వెంలలో మూడు, సూర్యాపేట రూరల్‌లో ఒకటి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాగునాడపల్లిలో ఒకటి, చింతగూడెంలో ఒకటి, విజయవాడ సిటీలో ఒకటి, రామయ్యపురంలో ఒకటి చొప్పున కేసులు నమోదై ఉన్నాయి. దీంతో నిందితుడిని స్థానిక కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వెల్లడించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


నజీర్ మృతదేహం

వేములపల్లి(మాడ్గులపల్లి): చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కడం గ్రామానికి చెందిన మహమ్మద్ నజీర్(50) తన గేదెను మేపేందుకు గ్రామ శివారులోని చెరువు వద్దకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో గేదె మేసుకుంటూ చెరువులోకి వెళ్లగా దానిని తీసుకురావడానికి నజీర్ చెరువులోకి దిగాడు. దీంతో ప్రమాదవశాత్తు ఊపిరి ఆడక నజీర్ అందులో మునిగిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు చెరువులోకి దిగి నజీర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

బైక్‌లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్: బైక్‌ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్ నిందితుడి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌టీఆర్ జిల్లా గొడుగుపేటకు చెందిన విన్నకోట సాయికుమార్ నకిలీ బంగారం బిస్కెట్స్, చైన్లు, ఉంగరాలు ప్రత్యేకంగా తయారు చేసుకున్నాడు. ఆగస్టు 7న బైక్‌ను దొంగలించేందుకు హన్మకొండ నుంచి జనగాంకు ర్యాపిడోలో బైక్‌ను బుక్ చేసుకున్నాడు. వచ్చే క్రమంలో బైక్‌ను దొంగతనం చేసేందుకు వీలుకాకపోవడంతో ర్యాపిడో వ్యక్తికి మరో రూ.వెయ్యి అదనంగా ఇస్తా సూర్యాపేటలో డ్రాప్ చేయమని అడిగాడు. దీంతో అతడు బైక్‌పై సూర్యాపేటకు తీసుకువచ్చి కొత్త బస్టాండ్‌వద్దకు రాగానే అతడిని ఏమార్చి బైక్‌ను దొంగలించాడు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం, యాదగిరిగుట్టలో బంగారు బిస్కెట్, ఆభరణాలు చూపించి తక్కువ ధరకు అమ్ముతానని పలువురిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని నున్న, కృష్ణలంక, అమలాపురం, మండపేట, గాజువాక, వైజాగ్ రూరల్, తాడేపల్లిగూడెం, గుడివాడ, నందిగామ, భీమవరం, అలమూర్, దవళేశ్వరం, మాచవరం, పెంటపాడు, ఆరండలపేట, అద్దంకి, తెలంగాణలోని ఖమ్మం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు 50 బైక్‌ల వరకు దొంగతనం చేశాడని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గమనించి విచారణ చేసినట్లు పేర్కొన్నారు. అతడి వద్ద మోటార్ సైకిల్, నకిలీ బంగారం స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ తెలిపారు. కేసును ఛేదించటంలో చాకచక్యత ప్రదర్శించిన సూర్యాపేట ఎస్‌ఐలు కె.గోపికృష్ణ, కుశలవ, హెడ్ కానిస్టేబుల్‌లు కరుణాకర్, కృష్ణ, సైదులు, కానిస్టేబుళ్లు శివ, మధులను సీఐ అభినందించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

మేళ్లచెరువు : బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేపల మాధవరం గ్రామానికి చెందిన బత్తుల శ్రీను (50) పనినిమిత్తం కోదాడకు వెళ్లి తిరిగి వస్తుండగా మండలంలోని కందిబండ గ్రామ సమీపంలోని కూలిన బ్రిడ్జి వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి బ్రిడ్జి పక్కన ఉన్న రాళ్లపైకి దూసుకెళ్లింది. దీంతో శ్రీను ముఖం, తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం అవుతుండగా గమనించి ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం బోల్తా

- ఒకరు మృతి

మిర్యాలగూడ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనం ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో ఒకరు మృతిచెందిన సంఘటన దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు అశోక్ లేలాండ్ వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి – నార్కట్‌పల్లి రహదారిపై వాహనం టైరు ఒక్కసారిగా పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తుల్లో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ బియ్యాన్ని తరలిస్తున్న సదరు వ్యక్తులు కారులో వాహనాన్ని అనుసరిస్తూ వస్తుండగా.. గాయపడిన వారిని గుంటూరుకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సుమారు పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి సీసీ పుటేజీను పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందగా.. అతడిది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి వాసిగా స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసులు దాచేపల్లికి వెళ్లి విచారించగా మృతుడు షేక్ నాగుర్‌వలీ(35)గా గుర్తించారు. మృతదేహాన్ని కారులో వచ్చిన వ్యక్తులు అతడి కుటుంబసభ్యులకు అప్పగించి అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

బాబా వేషధారణలో వచ్చి నగదుతో ఉడాయించాడు

- ఆత్మకూరు(ఎం) మండలం సింగారం పరిధిలోని శేర్‌బావి గ్రామంలో ఘటన

ఆత్మకూరు(ఎం) : బాబా వేషధారణలో వచ్చిన ఓ వ్యక్తి.. ఇంట్లో నగదు కాజేసి ఉడాయించాడు. ఈ సంఘటన ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం పరిధిలోని శేర్‌బావి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న శేర్‌బావి గ్రామంలో సుమారు ఏడు ఇళ్ల వరకు ఉంటాయి. శుక్రవారం ఉదయం గ్రామానికి తెల్లని లుంగీ, చొక్కా.. చేతిలో నెమలి ఈకల కట్టతో బాబా వేషధారణలో ఓ వ్యక్తి భిక్షాటన చేయడం ప్రారంభించాడు. రెండు, మూడు ఇళ్లు భిక్షాటన చేసిన అనంతరం అతడు వాకిటి మల్లారెడ్డి ఇంటికి వెళ్లాడు. మీ ఇంటికి దోషం ఉందని, రూ.30వేలు ఇస్తే బాగు చేస్తానని అంటూ మాయమాటలు చెప్పాడు. దీంతో అతడిని మల్లారెడ్డి, అతడి భార్య మణెమ్మ ఇంట్లోకి ఆహ్వానించారు. తమ వద్ద అంత డబ్బులు లేవని అంటుండగానే బాబా చేతిలో ఉన్న ఊదును చల్లడంతో వారు మైకంలోకి వెళ్లిపోయారు. వెంటనే అతడు ఇంట్లో ఉన్న డబ్బులు తీసుకురమ్మని అనడంతో వారు వడ్లు అమ్మగా వచ్చిన రూ.48వేలను బాబా చేతికి ఇచ్చారు. వెంటనే నకిలీ బాబా రూ.48వేలు తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. ఐదు నిముషాల అనంతరం తేరుకున్నాక బాబా ఇంట్లో లేకపోవడంతో అటు ఇటు వెతికారు. బైక్‌పై సమీపంలోని చందెపల్లి గ్రామానికి వెళ్లి వెతికారు. అయినా కనిపించకపోవడంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు ముందు సింగారంలో గ్రామంలో మాజీ సర్పంచ్ జామ యాదయ్య చేయి చూశాడని, అక్కడ జనం ఎక్కువగా ఉండడంతో శేర్‌బావి గ్రామానికి వచ్చినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ సాల్మన్‌రాజు వెల్లడించారు.

లారీని ఢీకొట్టిన పశువులు తరలిస్తున్న వాహనం


ప్రమాదానికి గురైన వాహనం

అర్వపల్లి: పశువులను అక్రమంగా తరలిస్తున్న ఐషర్ వాహనం లారీని ఢీకొట్టిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని నకిరేకల్– తానంచర్ల జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు హనుమాన్ జంక్షన్ నుంచి 56 పశువులను ఐషర్ వాహనంలో శుక్రవారం తెల్లవారుజామున తరలిస్తుండగా.. అర్వపల్లిలోని తుంగతుర్తి రోడ్డులో ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో ఐషర్ క్యాబిన్ దెబ్బతిని లారీలోకి ఇరుక్కుపోయింది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బాలకృష్ణ, ఏఎస్‌ఐ రాములు, హోంగార్డులు అక్కడకు వచ్చి స్థానికుల సాయంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ కెతావత్ కళ్యాణ్‌ను బయటకు తీశారు. అతడిని 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఐషర్ వాహనంలో 40 ఆవుదూడలు, 16 కోడెదూడలు ఉండగా.. పోలీసులు వాటిని మరో లారీలోకి ఎక్కించి నాగర్‌కర్నూల్ జిల్లా వెలిదండ మండలం కర్వొనిపల్లి గ్రామంలోని గురునానక్ గోశాలకు తీసుకెళ్లారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోపాటు, అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న డ్రైవర్ కళ్యాణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండల కేంద్రంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కేజేఆర్ కాలనీకి చెందిన వడ్యా బాలమ్మ మాడ్గులపల్లి మండల కేంద్రంలోని రేషన్‌కార్డు దారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి గ్రామంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచింది. విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి సుమారు 16బస్తాల(8క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని పట్టుకుని, బాలమ్మపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

రఘునాథపాలెంలో 10క్వింటాళ్లు..

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో అక్రమంగా నిల్వచేసిన 10క్వింటాళ్ల రేషన్(పీడీఎస్) బియ్యాన్ని శుక్రవారం రాత్రి మండల పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో దాడులు చేసి పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఒకరు మృతి

కేతేపల్లి : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఉప్పలపహాడ్ శివారులో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కంకిపాడు చెందిన షేక్ బాషా(34) శుక్రవారం తెల్లవారుజామున తన ఆటోలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని ఉప్పలపహాడ్ శివారులో గల లిటిల్ విలేజ్ హోటల్ సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ లగ్జరీ బస్సు ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుతున్న షేక్ బాషా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాద విషయం తెలుసుకున్న మండల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

సంస్థాన్ నారాయణపురం: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగాం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండూరి చంద్రయ్య తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తుర కాలు జారడంతో కింద పడ్డాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వేరుశనగ సాగుకు అనువైన సమయమిదే..

నడిగూడెం: వేరుశనగ సాగుకు అనువైన సమయమిదేనని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాయపుదేవ ప్రసాద్ తెలిపారు. అధిక దిగుబడులు పొందడానికి పంట సాగులో పాటించాల్సిన మెలకువలు ఆయన మాటల్లోనే..

అనువైన నేలలు : తేలికపాటి, నీరు నిలబడని, మురుగు నీరు నిల్వకుండా గాలి ప్రసరించే ఎర్ర చల్కా, ఇసుకతో కూడిన గరప నేలలు వేరుశనగ సాగుకు అనుకూలం.

రకాల ఎంపిక : ఆయా ప్రాంతాలకు అనుకూలమైన, అందుబాటులో ఉన్న మేలైన రకాలు ఎంపిక చేసుకోవాలి. ప్రస్తుత యాసంగిలో నీటి వసతి కింద కదిరి–6, కదిరి–9, టీఏజీ– 24, ఐసీజీవీ–91114, ధరణి, రకాలు అనువైనవి.

విత్తన మోతాదు : గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తన మోతాదు మారుతుంది. రబీలో 60–80 కిలోల విత్తనం ఒక ఎకరానికి సరిపోతుంది.

విత్తన శుద్ధి : విత్తే ముందు విత్తనశుద్ధి చేయాలి. కిలో విత్తనానికి 1 గ్రాము టెబ్యుకొనాజోల్ చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. వేరు పురుగు సమస్య ఉన్న నేలల్లో విత్తేటప్పుడు కిలో విత్తనానికి 6.5 క్లోరిపైరిఫాస్, కాండం కుళ్లు, వేరుకుళ్లు ఆశించే ప్రాంతాల్లో 1 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్‌ఎస్‌ను 7 మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. కొత్తగా వేరుశనగ సాగు చేసే ప్రాంతాల్లో 200 గ్రాముల రైజోబియం కల్చర్‌లను ఒక ఎకరానికి సరిపడా విత్తనానికి పట్టించాలి.





విత్తే దూరం : గుత్తి రకాలైతే మొక్కల మధ్య 22.5 సెం.మీ. వరుసల మధ్య 10 సెం.మీ దూరం, పెద్ద గుత్తి రకాలైతే వరుసల మధ్య 30 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ దూరం ఉండేలా విత్తుకోవాలి.

ఎరువులు యాజమాన్యం : భూసార పరీక్షను అనుసరించి ఎరువుల మోతాదు నిర్ణయించుకోవాలి. ఆఖరి దుక్కిలో 3–4 టన్నులు బాగా చివికిన పశువుల ఎరువు ఒక ఎకరానికి వేయాలి. 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 33 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల నత్రజని విత్తే సమయంలో వేసుకోవాలి. తర్వాత పైపాటుగా 9 కిలోల నత్రజని పంట 30 రోజుల దశలో వేయాలి. అలాగే 200 కిలోల జిప్సంను పంట పూత దశలో (35–40) రోజులప్పుడు ఒక ఎకరానికి వేసుకోవాలి. అనంతరం అంతర కృషి చేయాలి. పైరుపై జింకు, ఐరన్ సూక్ష్మధాతు లోపాలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి పంట దిగుబడి తగ్గే వీలుంది. ఒక వేళ పైరుపై జింకు లోపం ఉంటే 400 గ్రాములు జింకు సల్ఫేట్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఇనుపధాతు లోపం ఉన్నట్లయితే ఒక కిలో అన్నభేది, 200 గ్రాముల సిట్రిక్ ఆమ్లాలను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కలుపు యాజమాన్యం : విత్తనాలు విత్తిన 1 లేదా 2 రోజుల్లో కలుపు రాకుండా నివారించడానికి ఒక ఎకరానికి ఒక లీటరు పెండిమిథాలీన్ 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంట 20–24 రోజుల దశలో మళ్లీ కలుపు వచ్చే ఆస్కారం ఉండడంతో క్విజలోఫాస్ పి ఇథైల్ మందును 400 మి.లీ. 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. ఒక వేళ వెడల్పాకు, గడ్డి కలుపు ఉంటే కలుపు 2–3 ఆకుల దశలో ఇమజితాపిర్ 10 శాతం మందును 300 మి.లీ. లేదా ఇమజామాక్స్ 35 శాతం 40 గ్రాములు చొప్పున ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నీటి యాజమాన్యం కీలకం : రబీ వేరుశనగ సాగుకు నీటి తడుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఊడలు దిగే దశ నుంచి కాయ అభివృద్ధి చెందే దశ వరకు నీటి ఎద్దడి, బెట్ట పరిస్థితులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తేలికపాటి నేలల్లో 6–8 తడులు అనగా విత్తే సమయంలో, మొలిచిన 20–25 రోజులకు, ఆ తర్వాత 7–10 రోజుల వ్యవధిలో 5–6 తడులు ఇవ్వాలి.